

## కొత్త టీచర్లకు పాఠశాలల కేటాయింపు

నరసన్నపేట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కొత్త టీచర్లకు పాఠశాలలు కేటాయిస్తూ ఆన్‌లైన్ ద్వారా నియమాకపు ఉత్తర్వులను విద్యాశాఖ జారీ చేసింది. ఉమ్మడి జిల్లాకు చెందిన ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్‌లు, భాషా పండితులు, పీఈటీలు 528 మంది కొత్త ఉపాధ్యాయులకు ఈనెల 3వ తేదీ నుంచి వృత్త్యంతర శిక్షణ ఇచ్చారు. శుక్రవారంతో శిక్షణ ముగిసింది. కొత్త టీచర్లకు శిక్షణ ముగింపు సమావేశంలో డీఈవో రవిబాబు పలు మార్గదర్శకాలను సూచించారు. ఉపాధ్యాయులంతా ఆన్‌లైన్‌లో వచ్చిన పాఠశాలల కేటాయింపు ఉత్తర్వులు డౌన్‌లోడ్ చేసుకుని.. కొత్తపాఠశాలల్లో ఈనెల 13న చేరాలని తెలిపారు.

# ఆ విలయం.. ప్రళయం

● 'తితలీ' విధ్వంసానికి ఏడేళ్లు

● అప్పట్లో ఉద్దానం ప్రాంతానికి తీరని నష్టం

● నేటికీ పూర్తిస్థాయిలో కోలుకోని వైనం

పలాస, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):

'తితలీ' పేరు చెబితే చాలు.. ఉద్దానం ప్రజల్లో అలజడి రేగుతోంది. 2018 అక్టోబరు 11న ఉద్దానం ప్రాంతంలో తితలీ తుఫాన్ విధ్వంసం సృష్టించింది. ఈ ప్రళయం వచ్చి నేటికి ఏడేళ్లు పూర్తవుతున్నా.. ఇంకా తితలీ నష్టం ప్రజల కళ్లముందే కనిపిస్తోంది. ఆ రోజు నిశిరాత్రి వేళ.. అంతా గాఢ నిద్రలో ఉండగా రాత్రి 2గంటల తరువాత విలయం.. ప్రళయమైంది. ఒకటి కాదు, రెండు కాదు ఏడుగంటల పాటు పెనుగాలులు, భారీ వర్షంతో ధ్వంసం చేసింది. వజ్రపుకొత్తూరు మండలంలో పల్లిసారథి వద్ద తుఫాన్ తీరం దాటగా.. 70-160 కిలోమీటర్ల వాయువేగంతో ఈదురుగాలులు వీచాయి. దీంతో తీర ప్రాంతం అతలాకుతలమైంది. ఉద్దానంలో పచ్చని జీడి, మామిడి చెట్లన్నీ నేలకూలాయి. విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. పలాస మండలం శాసనంలో గోడ కూలి పది గేదెలు, 20మేకలు, గొర్రెలు మృతి చెందాయి. గ్రామీణ రహదారులతో పాటు జాతీయరహదారిపై కూడా నీరు వరదలై పారింది. మొగిలిపాడు, కాశీబుగ్గ, చినబాడం, అంతరకుడ్డ, పెసరపాడు, పారసాంబ వెళ్లే దారుల్లో రెండు అడుగుల లోతులో నీరు పొంగి ప్రవహించింది. ఈదురుగాలుల ప్రభావానికి మొగిలిపాడు వద్ద ఇనుపలోడుతో వెళ్తున్న మూడు లారీలు.. ఎగిరి బోల్తాపడ్డాయి. కాశీబుగ్గ-పలాసలో ఉన్న ఆరుపెట్రోల్ బంకుల్లో పైకప్పులు గాలికి 500మీటర్ల దూరంలో ఎగిరిపడ్డాయి. జంటపట్టణాల్లో హోర్డింగ్‌లన్నీ నామరూపాల్లేకుండా నేలరాలాయి. రోడ్డుపైన భారీ చెట్లు నేలకొరగడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మరో పక్క విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ప్రజలు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పల్లిసారథిలో తుఫాన్ తీరం దాటిన సమయంలో వీచిన గాలులకు వర్షానికి ప్రజలు అల్లాడిపోయారు.

● తితలీ తుఫాన్ (మిగతా 6వ పేజీలో..)



ఉద్దానంలో తితలీ విలయానికి నేలకూలిన కొబ్బరి తోటలు (ఫైల్)



మధ్యాహ్నం 12 గంటలైనా ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకాక ఖాళీగా ఉన్న కుర్చీలు

# అధికారులు లేరు.. ప్రజాప్రతినిధులు రారు

● ఇదీ జడ్పీ స్థాయీ సంఘ సమావేశాల దుస్థితి

● సమస్యలు వినేదెవరంటూ ఎమ్మెల్యే కూన రవి ధ్వజం

అరసవల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని జడ్పీ స్థాయీ సంఘ సమావేశం వెలవెలబోయింది. జడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు స్థాయీ సంఘ సమావేశాలు ప్రారంభించాల్సి ఉంది. కాగా.. సకాలంలో పూర్తిస్థాయిలో అధికారులు లేక.. ప్రజాప్రతినిధులు రాలేదు. దీంతో మధ్యాహ్నం 2.45 గంటలకు జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన సీఈవో సత్యనారాయణ ఆధ్వర్యంలో సమావేశం ప్రారంభమైంది. మధ్యాహ్న సమయానికి కూడా సమావేశానికి జిల్లా స్థాయి అధికారులు చాలామంది గైర్హాజరయ్యారు. ప్రజాప్రతినిధులు కూడా అతి కొద్ది మంది మాత్రమే వచ్చారు. దీంతో సమస్యలపై చర్చ ముందుకు సాగలేదు. సమస్యను ప్రస్తావిస్తే.. కిందిస్థాయి సిబ్బంది 'మా పై అధికారుల దృష్టికి తీసుకువెళతాం' అని చెప్పడంతో సమావేశానికి హాజరైన పీయూసీ చైర్మన్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశాలకు జిల్లా అధికారులు హాజరుకాకుంటే సమస్యల పరిష్కారం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. సమస్యలను ప్రస్తావించే వేదిక ఇదని, ఇటువంటి సమావేశాలకు హాజరు కావాల్సిన బాధ్యత అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఉందని స్పష్టం చేశారు. 'గత నెలలో జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో ఎటువంటి అంశాలు చర్చింకుండానే వైసీపీ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు ప్రొటోకాల్ రగడ పేరిట బయటకు వెళ్లిపోయారు. ఇది ఎంతమాత్రం హర్షించదగ్గ చర్య కాదు. ఏ విషయమైనా (మిగతా 6వ పేజీలో..)




జడ్పీ చైర్‌పర్సన్ విజయ, సీఈవో సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

# చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి

● జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, కమిటీ సభ్యులతో జిల్లాస్థాయి విజిలెన్స్, మోనటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో వివిధ స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్న అట్రాసిటీ కేసుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ ఏడాది నమోదైన కేసుల వివరాలు, వాటి ప్రస్తుత స్థితిని వివరించారు. గత మూడు నెలల్లో బాధితులకు రూ.18లక్షల వరకు పరిహారం చెల్లించామని తెలిపారు. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులపై, భూ కబ్జాల సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. పెండింగ్ కేసుల విచారణ పూర్తిచేయాలని, బాధితులకు న్యాయం చేయాలని కోరారు. నరసన్నపేట, శ్రీకాకుళం ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, (మిగతా 6వ పేజీలో..)



మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

## పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

అరసవల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం వేళ.. పంచారామ క్షేత్రాలను భక్తులు సందర్శించేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు జిల్లా ప్రజారవాణా అధికారి సీహెచ్ అప్పలనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'రాష్ట్రంలోని అమరావతి(అమరారామం), భీమవరం(భీమారామం), పాలకొల్లు(క్షీరారామం), ద్రాక్షారామం, సామర్లకోట (కుమారారామం) క్షేత్రాలకు ఈ బస్సులు నడుపుతాం. ఈ నెల 26, నవంబరు 2, 9, 16వ తేదీల్లో పలాస, టెక్కలి, శ్రీకాకుళం డిపోల నుంచి సాయంత్రం 4 గంటలకు బస్సులు బయలుదేరతాయి. వీటికి ముందస్తుగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఏపీఎస్‌ఆర్టీసీ ఆన్‌లైన్.ఇన్ ద్వారా రిజర్వేషన్ చేసుకోవచ్చు. పూర్తిగా బుక్ చేసుకున్నవారికి ఇంటివద్దకే బస్సు వస్తుంది. ఒక మనిషికి శ్రీకాకుళం నుంచి సూపర్ లగ్జరీ రూ.2400, అల్ట్రా డీలక్స్ రూ.2,350 చార్జీలుగా నిర్ణయించాం. అలాగే విశాఖదర్శిని, అరకు దర్శిని, శైవక్షేత్రాలను దర్శించుకునేందుకు, పిక్నిక్ స్పాట్‌లకు వెళ్లేందుకు అద్దె ప్రాతిపదికన బస్సులు కేటాయిస్తాం. మరిన్ని వివరాలకు 9959225608, 9959225609, 9959225610, 9959225611 నెంబర్లను సంప్రదించాల'ని జిల్లా ప్రజారవాణా అధికారి అప్పలనారాయణ కోరారు.

# మస్తర్ల మాయాజాలానికి చెక్

● ఉపాధి హామీ వేతనదారులకు ఈ-కేవైసీ

● ఆధార్- జాబ్‌కార్డుల అనుసంధానం ● క్షేత్రస్థాయిలో పనికి వెళితే వేతనం

నరసన్నపేట/ కోటబొమ్మాళి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):

ఉపాధిహామీ పథకం అమలులో అక్రమాలకు అడ్డుకట్ట వేసేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. మస్తర్ల మాయాజాలానికి చెక్‌పెట్టేలా ఉపాధిహామీ వేతనదారులకు ఈ-కేవైసీ తప్పనిసరి చేసింది. వేతనదారులు తమ ఆధార్ కార్డును జాబ్‌కార్డుతో అనుసంధానం చేసుకుంటేనే ఉపాధిహామీ పని కల్పించాలని నిర్ణయించింది. ఉపాధిహామీ పథకం పనుల్లో పారదర్శకత కొరవడిందన్న ఆరోపణలున్నాయి. జిల్లాలో కొంతమంది వేతనదారులు పనులకు రాకపోయినా.. ఉపాధిహామీ సహాయకులు వారు హాజరైనట్టు నమోదు చేస్తూ నిధులు స్వాహా చేసేవారు. సామాజిక తనిఖీల్లో ఈ వ్యవహారం బయటపడేది. చాలా గ్రామాల్లో మస్తర్ల మాయాజాలంలో ప్రతిరోజూ పనిచేసే కూలీలకు సగటు వేతనం రూ.310 దక్కడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ అవకతవలపై ఉన్నతాధికారులకు వేతనదారుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ క్రమంలో నరేగా పద్దు దుర్వినియోగం కాకుండా ఉండాలనే సదుద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఉపాధిహమీ పథకం అమలులో నూతన మార్గదర్శకాల అమలుకు శ్రీకారం చుట్టింది. బోగస్ మస్తర్లకు చెక్ పెట్టాలని నిర్ణయించింది. క్షేత్రస్థాయిలో అవినీతికి పాల్పడకుండా జాబ్‌కార్డులు పొందిన కార్మికుల కుటుంబసభ్యులతో కచ్చితంగా ధ్రువీకరణ(ఈ-కేవైసీ) చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో పనిచేస్తున్న వేతనదారులకు అధికారులు, సిబ్బంది ఈ-కేవైసీ నమోదు చేస్తున్నారు.

● జిల్లాలో మొత్తం 7,49,268 మంది జాబ్‌కార్డు కలిగిన వేతనదారులు ఉన్నారు. వీరిలో గురువారం నాటికి 3,88,334 మంది వేతనదారులకు సంబంధించి అధికారులు ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తిచేశారు. జాతీయ మస్టరు పర్యవేక్షణ వ్యవస్థ(ఎన్ఎంఎంఎస్) యాప్‌లో వేతనదారుల వివరాలు నమోదు చేశారు. వేతనదారుల జాబ్‌కార్డులను, ఆధార్ కార్డులను అనుసంధానం చేస్తున్నారు. అలాగే వేతనదారుల (మిగతా 6వ పేజీలో..)





ఉపాధిహామీ వేతనదారులకు ఈ-కేవైసీ నమోదును పరిశీలిస్తున్న డ్వామా పీడీ సుధాకర్ (ఫైల్)

## ఏపీఈఏపీ సెట్ బైపీసీ స్ట్రీమ్ వెబ్‌కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఏపీ ఈఏపీ సెట్‌కు బైపీసీ స్ట్రీమ్‌లో హాజరైన విద్యార్థుల ప్రవేశాలకు వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైనట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల(శ్రీకాకుళం) ప్రిన్సిపాల్, సహాయ కేంద్రం సమన్వయకర్త కె.నారాయణరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'బీ-ఫార్మసీ, ఫార్మా-డీ, బయో/ఫుడ్ టెక్నాలజీ, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి సాంకేతిక విద్య, ఉన్నత విద్యాశాఖలు సంయుక్తంగా ఈ షెడ్యూల్‌ను విడుదల చేశాయి. తొలివిడత వెబ్ కౌన్సెలింగ్‌కు సంబంధించి ఈ నెల 12 నుంచి ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలి. 13, 14వ తేదీల్లో సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేసి పరిశీలన పూర్తి చేసుకోవాలి. 14 నుంచి 17 వరకు కళాశాలలు, కోర్సుల ఎంపికకు వెబ్‌ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. 18న వెబ్‌ఆప్షన్ల నమోదులో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చు. 21న సీట్లు కేటాయింపు జాబితా విడుదలవుతుంది. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 21 నుంచి 24వ తేదీలోగా సంబంధిత కళాశాల్లో రిపోర్ట్ చేయాలి. సాంకేతిక సమస్యలు ఎదురైతే విద్యార్థులు పాలిటెక్నిక్ కళాశాలలోని సహాయ కేంద్రాన్ని సంప్రదించాలి. తుది విడతకు సంబంధించి వెబ్ కౌన్సెలింగ్ ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు జరుగుతుంద'ని ప్రిన్సిపాల్ నారాయణరావు వివరించారు.

## జిల్లా సమీక్ష కమిటీ సమావేశం వాయిదా

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా సమీక్ష కమిటీ సమావేశాన్ని వాయిదా వేశామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం డీఆర్సీ సమావేశాన్ని నిర్వహించాల్సి ఉండగా.. కొన్ని కారణాలవల్ల వాయిదా వేశామని, ఎప్పుడు నిర్వహిస్తామన్నది త్వరలో ప్రకటిస్తామన్నారు.



సునాముది ఆయకట్టులో ఇసుక మేట

# వరిపొలాల్లో ఇసుక మేటలు

● ఆందోళనలో రైతులు

హరిపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా రైతులకు నష్టం తప్పడం లేదు. వర్షాలు వెరసి ఐదు రోజులు గడిచినా వాటి విషాద ఛాయలు వీడలేదు. వర్షాల ప్రభావంతో కాలువలు, పొలంగట్లకు గండి పడి.. చాలాచోట్ల వరి పంట నీట మునిగింది. నీరు వెలిశాక చూస్తే ప్రస్తుతం పొలాల్లో ఇసుక మేటలు దర్శనమిస్తున్నాయి. మందస మండలంలో సంకుజోడి, సునాముది, డబార్సింగి, కళింగదల్, మహేంద్రతనయా, దామోదరసాగర్ ఆయకట్టులో సుమారు 200 హెక్టార్లకుపైగా వరిపొలాల్లో ఇసుక మేటలు వేశాయి. దీంతో మఖరజోల, మధ్య, పిడిమందస, దేవుపురం, బుడార్సింగి, కిల్లోయి, హంసరాళి, (మిగతా 6వ పేజీలో..)

## పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి

హిరమండలం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): హిరమండలం మండలం పింద్రువాడ కాలనీకి చెందిన దువ్వ శిమ్మయ్య(70) పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. శుక్రవారం మధ్యాహ్నం శిమ్మయ్య తన కుమారుడు హరికృష్ణతో కలిసి పొలంలో గొర్రెలు మేపుతున్నాడు. ఆ సమయంలో భారీ వర్షం కురవగా.. పొలం సమీపంలో పిడుగు పడింది. దీంతో శిమ్మయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. కుమారుడు హరికృష్ణ అస్వస్థతకు గురయ్యాడు. దీనిపై స్థానికులు హిరమండలం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ వెంకటేష్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారు.



శిమ్మయ్య (ఫైల్)



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లక్ష్మణరావు, సీఐ శ్రీనివాసరావు

## దారికాచి దోపిడీ

● ఐదుగురు హిజ్రాలు, డ్రైవర్ అరెస్టు

● బంగారం ఆభరణాలు, కారు స్వాధీనం

● నిందితులది తూర్పుగోదావరి జిల్లా

8లో

## కక్షసాధింపు చర్యలు మానుకోవాలి

● తపాలా ఉద్యోగుల నిరసన

6లో

## నగరంలో చోరీ కలకలం

● 35 గ్రాముల బంగారం అపహరణ

8లో

# వర్షాకాలం.. వాహనాలు భద్రం

● చెడిపోకుండా జాగ్రత్తలు పాటించాలి



నరసన్నపేట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఇది వర్షాకాలం. జిల్లాలో తరచూ వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ఇలాంటప్పుడు ద్విచక్ర వాహనాల విషయంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా చెడిపోయే ప్రమాదం ఉంది. విడిభాగాలు పాడైతే వ్యయం భరించాల్సి ఉంది. వర్షాల సమయంలో జాగ్రత్తలు పాటిస్తే వాహనం మంచి కండిషనల్‌లో ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

**చైన్ స్ప్రాకెట్..**

దిచక్రవాహనాలకు చైన్లకు మూతలు ఉన్నా, వాటి మధ్య సందులున్నా, చైన్ కవరుకు కేప్ లేకున్నా నీరుచేరుతుంది. ఇది చైన్‌లో నుంచే ఆయిల్‌ను నిర్వీర్యం చేస్తుంది. ఫలితంగా చైన్‌స్ప్రాకెట్‌లో శబ్దం మొదలై ఒదులు అవడంతో పాటు జాయింట్ల మధ్య దూరం పెరుగుతుంది. చైన్ స్ప్రాకెట్ మార్చాలంటే కనీసం రూ.1500 ఖర్చు అవుతుంది. వర్షంలో ప్రయాణించాక చైన్‌లో తడి ఉంటే మెకానిక్‌తో ఆయిల్ వేయించడం కానీ, గ్రీజు రాయించడం కానీ చేయాలి.

**సైలెన్సర్..**

నీరు, బురద కారణంగా సైలెన్సర్ చిల్లులు పడుతుంది. దీని అడుగు భాగంలో ఏ మాత్రం బురద లేదా మట్టి పట్టినా శుభ్రం చేయాలి. లేదంటే తుప్పు పడుతుంది. సైలెన్సరు మార్చాలంటే వెయ్యి రూపాయలు ఖర్చు అవుతుంది.



మూతలేని టూవీలర్ చైన్ స్ప్రాకెట్

**ఇంజను..**

వర్షాకాలంలో గుంతల రోడ్లపై ప్రయాణించేటపుడు సైలెన్సరులోకి నీరుచేరి ఇంజనులోకి ప్రవేశిస్తుంది. తద్వారా ఇంజను తరుచూ మొరాయిస్తుంది. ఒక సారి ఇంజను విప్పాలంటే దెబ్బతిన్న విడిభాగాల మార్పిడితో పాటు సర్వీసింగుకు కనీసం వెయ్యిరూపాయలు వరకు ఖర్చువుతుంది. సాధ్యమైనంతవరకు గోతుల్లోంచి కాకుండా కాస్త వేగాన్ని తగ్గించి పక్కనుంచి వెళ్లాలి.

**డిస్కులు..**

ప్రస్తుతం డిస్కు బ్రేకులున్న ద్విచక్ర వాహనాలు సంఖ్య పెరుగుతోంది. డిస్కు జీవిత కాలం కనీసం 30వేల కిలో మీటర్లు. వర్షాకాలంలో బురద, ఇసుక, మట్టి చేరి త్వరగా పాడవుతాయి. బ్రేకు వేసినప్పుడు శబ్దం వస్తుంది. దీన్ని మార్చుకోవాలంటే కనీసం 1250 రూపాయలు ఖర్చువుతుంది. వాహనం నీటిలో నుంచి వెళ్లినపుడు సాధ్యమైనంతవరకు డిస్కుబ్రేకును వాడకపోవడం మంచిది. ప్రయాణం ముగిశాక డిస్కుకు ఉండే కార్కు సందుల్లో నీటితో కడిగి తుడవాలి.



టూవీలర్ ఇంజను

**ఈ జాగ్రత్తలు తప్పనిసరి..**

- ద్విచక్ర వాహనం వర్షంలో ప్రయాణించగానే ఇంజను కింది భాగంలో మట్టిలేకుండా శుభ్రంగా తుడవాలి.
- బైకుస్టాండ్ స్ప్రింగులలో మట్టిచేరితే యాక్షను ఉండదు. స్ప్రింగ్ కొక్కేల వద్ద ఆయిల్ వేయాలి.
- పెట్రోల్ ట్యాంకు మూత సరిగా లేకుంటే నీరు కార్బొరేటర్‌లోకి చేరుతుంది.
- సీటు కవర్లు తడిస్తే వేగంగా పాడవుతాయి. తడవకుండా చూసుకోవాలి.
- నీటితో యాక్సిలేటర్లు, క్లచ్ లీవర్లు అంత సులభంగా పనిచేయవు. వాటి తీగలకు గ్రీజు రాస్తే వదులుగా మారుతాయి.
- బైకులను బయట వదలిపెట్టాల్సి వస్తే తప్పనిసరిగా కవర్లు కప్పడం మంచిది.

**వర్షాకాలంలో జాగ్రత్తగా ఉండాలి..**

వర్షాకాలంలో దిచక్రవాహనాలు, కార్లు డ్రైవ్ చేసేటప్పుడు చాలా జాగ్రత్తలు పాటించాలి. వాహనాలను వర్షంలో తడవకుండా ఉండేటట్లు చూడాలి. వాహనం తీసిన కొద్ది సమయంలో నెమ్మదిగా వెళ్లాలి. ఈ కాలంలో రోడ్లు తడిచి ఉంటాయి. టైర్ గ్రిప్ తక్కువగా ఉంటుంది. సడన్ బ్రేక్ వేస్తే ప్రమాదాలు జరుగుతాయి. నెమ్మదిగా వెళ్లాలి. వాహనాలను తరుచుగా చెక్ చేసుకోవాలి.

-సోమేశ్వరరావు, బైక్ మెకానిక్, నరసన్నపేట

## అధికారులు లేరు.. ప్రజాప్రతినిధులు రారు

(ఐదో పేజీ తరువాయి)

సమావేశంలోనే చర్చించాలి. సొంత అజెండాతో ఇలా ప్రవర్తించడం సరికాదు. ప్రజలు ఎన్నుకున్నది ఇందుకేనా?. జడ్పీటీసీలకు బాధ్యత లేదా?' అని రవికుమార్ ప్రశ్నించారు. జడ్పీ ఆధ్వర్యంలో జరిగిన పనులకు బిల్లులు చెల్లించాలని, లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న, ఇంకా మొదలుకాని పనుల వివరాలను తెలియజేయాలని అధికారులను కోరారు. సమస్యలపై పెద్దగా చర్చ జరగకుండానే సమావేశం సాయంత్రం 5 గంటలకు ముగిసింది. జడ్పీటీసీ సభ్యులు టొంపల సీతారాం, కిలారి త్రినాథులు, ధర్మాన కృష్ణచైతన్య, సురవరపు నాగేశ్వరరావు పాల్గొన్నారు.



అఖిల భారత యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ట్రిపుల్ ఐటీ అధికారులు

## అఖిల భారత పోటీల్లోనూ రాణించాలి

ఎచ్చెర్ల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అఖిల భారత యోగా పోటీల్లోనూ రాణించాలని ఆర్జీయూకేటీ, శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ అన్నారు. ఈనెల 8,9 తేదీ ల్లో నూజివీడులో జరిగిన అంతర్ కళాశాలల యోగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 24 నుంచి 28 వరకు బెంగుళూర్‌లో జరగనున్న అఖిల భారత యోగా చాంపియన్ షిప్-2025 పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారన్నారు. వ్యక్తిగత విభాగంలో బి. భావన, కె.మేఘన, మహిళల బృంద విభాగంలో ఎం.హేమ రితీక, పి.కారుణ్య, ఎన్.నళిని, ఎ.రాధిక, జి. మహేశ్వరి, పురుషుల విభాగంలో ఇ.భరత్‌సాయి, పి.జవితనాయుడు, ఎం.నవీన్ కుమార్, కె.రాకేష్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో క్యాంపస్ ఏవో ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ శివరామకృష్ణ, ఎఫ్‌వో వాసు, వెల్ఫేర్ డీన్ రవి, విభాగాధిపతి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కాశీబుగ్గ ఎల్‌సీ గేటు..

## గేట్ల వద్ద నిబంధనలు పాటించాల్సిందే

● ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: ఈస్ట్‌కోస్ట్ రైల్వేశాఖ

పలాస, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రైల్వే లెవెల్‌క్రాస్ గేట్ల వద్ద భద్రత నిబంధనలు పాటించాలని, దీన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని రైల్వే శాఖ హెచ్చరించింది. ఈ మేరకు ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఖుర్దా డివిజన్ ప్రజా సంబంధాల అధికారి ప్రకటన జారీ చేశారు. లెవెల్‌క్రాస్ గేట్ల వద్ద అజాగ్రత్తగా వాహనాలు నడపడం వల్ల రైళ్ల సమయపాలన దెబ్బతింటోందని, ప్రజలు తమకు సహకారం అందించాలని కోరారు. ఇటీవల గేట్లు ఉల్లంఘనలు, గేట్లు విరగ్గొట్టడాలు ఎక్కువ అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల ప్రాణాలకు ముప్పు వాటిల్లడంతో పాటు రైల్వేశాఖకు అపారమైన నష్టం కలుగుతోందన్నారు. అనేక సందర్భాల్లో వాహనదారులు మూసివేసిన గేట్లను బలవంతంగా దాటడానికి ప్రయత్నిస్తున్నారని, దీనివల్ల అడ్డంకులు ఏర్పడుతున్నాయని, సిగ్నల్ వైఫల్యాలు కూడా జరుగుతున్నాయని అన్నారు. దీనివల్ల రైళ్ల సమయపాలన కోల్పోవడం, రైలు కార్యకలాపాలకు అంతరాయం కలగడం, ఆస్తి నష్టం వాటిల్లడం జరుగుతోందన్నారు. 2024 సంవత్సరంలో ఖుర్దా డివిజన్‌లో మొత్తం 113 గేటు ఉల్లంఘన కేసులు నమోదు కాగా 92 మందిని అరెస్టు చేసామన్నారు. 2025 సంవత్సరంలో అక్టోబరు 8వ తేదీ వరకూ 64 కేసులు నమోదు కాగా 47 మందిని అరెస్టు చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం ఎల్‌సీ గేట్లు విరగ్గొట్టే ఘటనలు పూర్తిగా నిషేధించామన్నారు. పలాస- ఖుర్దా డివిజన్ల ఐదు ఘటనలు జరిగాయని, దీనిపై కేసులు నమోదు చేశామని వెల్లడించారు.

**ఆర్పీఎఫ్‌ల ద్వారా అవగాహన కార్యక్రమాలు..**

రైల్వే పొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో భద్రతా చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని డీపీఆర్‌వో తెలిపారు. లెవెల్ క్రాసింగ్‌ల వద్దకు వాహనాలు వచ్చేసరికి అప్రమత్తంగా ఉండాలని, మూసివేసిన గేట్లను దాటేందుకు ప్రయత్నించడం వల్ల నష్టం జరుగుతుందనే విషయాన్ని గుర్తించాలని అన్నారు. రైల్వే చట్టంలో నిబంధనల ప్రకారం ఎల్‌సీ గేట్ల ఉల్లంఘనపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## కక్షసాధింపు చర్యలు మానుకోవాలి

● తపాలా ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న తపాలా ఉద్యోగులు

కాశీబుగ్గ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు మానుకోవాలని, ఇందులో భాగంగా విధుల నుంచి తొలగించిన తపాలా ఉద్యమ జాతీయ నాయకులు మహదేవయ్యను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఏఐజీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి నందికేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం కాశీబుగ్గ తపాల కార్యాలయం ఆవరణలో దేశ వ్యాప్త ఆందోళనలో భాగంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ తపాలా ఉద్యోగుల సంక్షేమానికి 2016లో నియమించిన కమలేష్ చంద్ర కమిటీ ఇచ్చిన సానుకూల సిఫార్సు అమలు చేయడం లేదని, దీనిపై కామ్రేడ్ మహదేవయ్య నాయకత్వంలోని ఉద్యమిస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే 2023 డిసెంబరులో నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చి నాలుగు రోజులపాటు ఆందోళన చేపట్టామన్నారు. తపాలా శాఖ ఉన్నతాధికారులు హామీ ఇచ్చిన అనంతరం సమ్మె విరమించామన్నారు. ఆనాడు జరిగిన సమ్మెకు నాయకత్వం వహించిన కామ్రేడ్ మహదేవయ్యను బాధ్యుడ్ని చేసి కక్షపూరితంగా ఈనెల 8న ఉద్యోగం నుంచి తొలగించడం అన్యాయమన్నారు. ఆయన్ని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని దేశవ్యాప్తంగా నిరసన తెలుపుతున్నామని స్పష్టం చేశారు. తపాలా సిబ్బంది రాజేష్, రాము, భాస్కరరావు, కిరణ్‌కుమార్, తులసీకృష్ణ, వెంకటరమణ, ప్రకాషరావు, కస్తూరి, జోగి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

**మహదేవయ్యను విధుల్లోకి తీసుకోవాలి..**

అరసవల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కమలేష్ చంద్ర కమిటీ సిఫారసులను అమలు చేయాలని కోరుతూ 2023లో జాతీయ సంఘం నేత మహదేవయ్య ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె నేపథ్యంలో దానికి బాధ్యుడిగా చేసి ఆయనపై చార్జిషీట్ వేసి కక్షపూరితంగా విధుల నుంచి తొలగించడం దారుణమని తపాలా ఉద్యోగుల సంఘ నేతలు అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం జాతీయ సంఘం పిలుపు మేరకు ప్రధాన తపాలా కేంద్రం ఎదుట తపాలా సిబ్బంది నిరసన తెలిపారు. తక్షణం ఆయనను విధుల్లోకి తీసుకో వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గణపతి, నేతలు బాబూరావు, యూవీ రమణ, గురన్న, సీఐటీయూ నాయకుడు పి.తేజేశ్వరరావు, బీఎస్ఎన్ఎల్ నాయకుడు గోవర్ధనరావు, చంద్రశేఖర్, పోస్టల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఘనంగా గౌరమ్మ పూజలు

సోంపేట రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మత్స్యకార గ్రామం ఎకువూరులో గౌరమ్మ (నందన్న) సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాడి పంటలతో, ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షిస్తూ నందన్న పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్థులు తెలిపారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పుక్కళ్ల ఆరేలమ్మ, మాడికమ్మ, బుజ్జమ్మ, రాజులమ్మ, రాణి తదితరులు పాల్గొన్నారు.



గౌరమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

**ఆకట్టుకున్న కాళిమాత వేషధారణ..**

లావేరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తామాడ గ్రామంలో గౌరీ పౌర్ణమి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం గౌరమ్మ, నందీశ్వరునికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విజయనగరం కళాకారులు కాళీమాత వేషధారణతో ఆకట్టుకున్నారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు ఉత్సవాల్లో పాల్గొన్నారు.

## వీవోఏల కాలపరిమితి రద్దుపై హర్షం

నరసన్నపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ సమాఖ్య సంఘాల్లో పనిచేస్తున్న వీవోఏల మూడేళ్ల కాలపరిమితిని సీఎం చంద్రబాబు రద్దు చేయడంపై వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించారు. ఆ సంఘ నాయకురాలు పుచ్చల కల్పన మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం వీవోఏల కాలపరిమితిని మూడేళ్లకే పరిమితం చేయడంతో ఎన్ని పోరాటాలు చేసినా ఫలితం లేకపోయిందని, చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తమపై ఉదారత చూపి రద్దు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఏపీఎం అప్పలరామయ్య, సీసీలు పరమేసు, లక్ష్మీరాజ్యం, వెంకటరమణ, రవికుమార్, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.



చంద్రబాబు చిత్రపటానికి పాలఅభిషేకం చేస్తున్న వెలుగు సిబ్బంది

## ట్రాక్ పనులతో రైళ్ల రాకపోకల్లో మార్పులు

ఇచ్ఛాపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఖుర్దా నుంచి పలాస వరకు రైల్వే పనులు ప్రారం భమయ్యాయి. ఈ కారణంగా నెల రోజుల పాటు పలు రైళ్ల రాకపోకల్లో మార్పులు, మరికొన్ని రైళ్లను రద్దు చేస్తున్నట్లు అధి కారులు ప్రకటించారని డీఆర్‌యూసీసీ సభ్యుడు కట్టా సూర్య ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం (10) నుంచి నవంబరు 11వ తేదీ వరకు భువనేశ్వర్-పలాస మెమో ప్రతి మంగళ, శనివారాల్లో, పలాస-భువనేశ్వర్ మెమో ఆది, బుధ వారాల్లో రద్దు చేశారన్నారు. కటక్ నుంచి పలాస వరకు నడిచే మెమో రైలు జాడుపూడి వరకు మంగళ, శనివారాల్లో వస్తుందని, బుధ, ఆదివారాల్లో జాడుపూడి నుంచి కటక్‌కు తిరుగు ముఖం పడు తుందన్నారు. ప్రస్తుతం బరంపురం నుంచి విశాఖపట్నం మధ్య నడిచే పాసిం జర్ రైలు విశాఖ నుంచి పలాస వరకు సోమ, మంగళ, శనివారాల్లో, పలాస నుంచి విశాఖ వరకు మంగళ, బుధ, శనివారాల్లో నడుస్తుందని అధికారులు ప్రకటించారన్నారు. ఈ నెల రోజుల రైళ్ల రాకపోకల మార్పులపై ప్రయాణికులు గమనించి సహకరించాలని కోరారు.

## ఆ విలయం.. ప్రళయం

(ఐదో పేజీ తరువాయి)

కారణంగా 16వేల ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. 45వేల హెక్టార్లల్లో జీడి, కొబ్బరి పంట నేలకొరిగింది. 7వేల విద్యుత్ స్తంభాలు కూలిపోగా, 200కు పైగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. ఒక్క విద్యుత్ శాఖకు రూ.50కోట్ల మేరకు నష్టం వాటిల్లినట్లు అంచనా. మొత్తంగా తితలీ తుఫాన్ వల్ల రూ.1500 కోట్ల వరకూ నష్టం వచ్చినట్లు విపత్తుల నివారణ సంస్థ అంచనా వేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించింది. తుఫాను విలయం ముందుగానే గుర్తించిన అప్పటి సీఎం చంద్రబాబు స్వయంగా పలాస చేరుకొని ఐదు రోజుల్లో విద్యుత్ ఇప్పించారు. తాగునీరు తక్షణమే పునరుద్ధరించారు. బాధితులకు నష్టపరిహారం అందించారు.

**ధ్వంసమైన రైల్వే వ్యవస్థ..**

సముద్రతీరానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలకు అప్పట్లో తీవ్ర నష్టం వాటిల్లింది. తితలీ తుఫాన్ ప్రభావంతో పలాస రైల్వేస్టేషన్ అంతా సర్వనాశనమైంది. మొత్తం 4 ప్లాట్‌ఫారాల్లో ఉన్న రూఫ్‌లన్నీ గాలికి ఎగిరిపోయాయి. స్టేషన్ మేనేజర్ రైళ్లను కంట్రోల్ చేసే ప్యానల్ సెక్షన్ మొత్తం ధ్వంసమైపోయింది. నిత్యం ప్రయాణికులతో కళకళలాడే ఈ స్టేషన్‌లో సుమారు 15 రోజులపాటు రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. పచ్చతోరణంగా ఉండే పలాస రైల్వేకాలనీలో ఐదువేలకు పైగా చెట్లు ధ్వంసమయ్యాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. రేకు గృహాలన్నీ నేలమట్టమయ్యాయి. దీంతో రైల్వే ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ గడిపారు.

**జీడిపరిశ్రమలకు అపార నష్టం..**

తితలీ విలయతాండంతో పలాస-కాశీబుగ్గలో జీడిపరిశ్రమలు రూ.150కోట్లకు పైగా నష్టానికి గురైనట్లు అంచనా. వందకుపైగా పరిశ్రమల రేకు షెడ్లు ఎగిరి ముడిసరుకంతా తడిసిపోయింది. మొగిలిపాడు ప్రాంతంలో ఈ ప్రభావం ఎక్కువగా కనిపించింది. ఒక్కో జీడిపరిశ్రమకు రూ.50లక్షల నుంచి రూ.కోటి వరకూ నష్టం వచ్చినట్లు వ్యాపారుల అంచనా. ఇప్పటికీ తితలీ తుఫాన్ నష్టం నుంచి కోలుకోలేని వ్యాపారులు అనేకమంది ఉన్నారు. జీడి, కొబ్బరి చెట్లు అనేకం నేలమట్టం కావడంతో 20ఏళ్ల అభివృద్ధి వెనక్కి మరలిపోయామని రైతులు ఆవేదన చెందుతున్నారు. నేటికీ కోలుకోలేకపోతున్నామని వాపోతున్నారు.

## మస్తర్ల మాయాజాలానికి చెక్

(ఐదో పేజీ తరువాయి)

కనుపాప (ఐరీష్) కూడా నమోదు చేస్తున్నారు. దీనివల్ల ఒకరికి బదులుగా మరొకరు పనికి వచ్చే అవకాశం ఉండదు. మృతుల పేర్లు నమోదు చేసే వీలు కుదరదు. దీంతో ఉపాధి హామీ బోగస్ హాజరుకు చెక్ పడనుంది. క్షేత్రస్థాయిలో పనికి వెళితేనే వేతనం అందనుంది.

**వారంలో పూర్తిచేయాలి..**

జిల్లాలో ఉపాధిహామీ పథకం వేతనదారుల ఈ-కేవైసీ నమోదు ప్రక్రియను వారంలోగా పూర్తిచేయాలని అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. అర్హులందరికీ ఉపాధిహామీ పథకం ద్వారా పనులు కల్పిస్తాం. నకిలీ మస్తర్లకు తావులేకుండా వేతనదారులకు వంద రోజులు పని కల్పించేందుకు కృషి చేస్తాం.

-బి.సుధాకర్, పీడీ, డ్వామా

## చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి

(ఐదో పేజీ తరువాయి)

గొండు శంకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అట్రాసిటీ కేసుల కారణంగా అన్యాయానికి గురైన కొందరు ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. తమ నియోజకవర్గాల్లో భూదందాలకు గురైన వారిని ఆదుకోవాలని కోరారు. సమావేశంలో డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, ఏఎస్పీ శ్రీనివాసరావు, ఆర్డీవో సాయి ప్రత్యూష, డీఎఎస్పీ సీహెచ్ వివేకానంద, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, బీసీ సంక్షేమాధికారి అనూరాధ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వరిపొలాల్లో ఇసుక మేటలు

(ఐదో పేజీ తరువాయి)

కళింగదల్, బీవైఆర్‌పురం, సింగుపురం తదితర గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలాల్లో ఇసుక, రాళ్లు మేటలు వేశాయని, గట్లుకు గండ్లు పడ్డాయని పేర్కొంటున్నారు. ఓ వైపు పంట నష్టపోగా.. మరోవైపు గట్లు వేయించేందుకు తమపై అదనపు భారం పడుతోందని వాపోతున్నారు. గట్లు, కాలువలు గండిపడి సుమారు ఎకరా పొలంలో రాళ్లు, ఇసుక మేటవేసి పంట దక్కని పరిస్థితి నెలకొందని సింగుపురం గ్రామానికి చెందిన రైతు ఒలేఖ్ విలపిస్తున్నాడు. పొలంలో వేసిన మేటలు తీయించడానికి సుమారు ఇరవై వేలు ఖర్చవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ప్రభుత్వం స్పందించి ఉపాధిహామీ పథకం ద్వారా గండ్లు పూడ్చి, ఇసుక మేటలు తొలగించాలని ఈ ప్రాంతరైతులు వేడుకుంటున్నారు. ఆ దిశగా జలవనరుల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరుతున్నారు.



సింగుపురం వద్ద కాలువకు గండి పడి పొలంలో రాళ్లు, ఇసుక మేటలు

## గ్రామీణ ప్రాంత రోడ్ల మెరుగుకు చర్యలు: అశోక్


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత రోడ్ల మెరుగుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బి.అశోక్ అన్నారు. పాత కొజ్జిరియా గ్రామంలో రోడ్డు పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధి పనులను చేపడుతూ గ్రామాల అభివృద్ధికి పాటు పడుతున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్ పి.చిన్నబాబు, రైల్వే మెంబర్ శ్రీనివాస రౌళో, టీడీపీ మండల అధ్యక్షుడు వి.కృష్ణారావు, పీఏసీఎస్ చైర్మన్ బాసుదేవ్ ప్రదాన్, సర్పంచ్ నీలవేణి, నేతలు శంకర్‌రెడ్డి, బి.రమేష్, ఎస్‌వీరమణ పాల్గొన్నారు.

## నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి: ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): యువతీ యువకులు తాము ఎంచుకున్న రంగంలో నైపుణ్యం పెంపొందించుకోవడం ద్వారా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నగరంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ మాట్లాడుతూ.. యువతకు ఉద్యోగాల కల్పనకు ఈ జాబ్‌మేళాలు దోహదపడతాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాలో 372 మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, ఎన్‌వైకే డీడీ వెంకట్ ఉజ్వల్, కళాశాల డైరెక్టర్ శ్రీధర్, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఉరిటి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వేబోర్డు సభ్యుడిగా 'బాలబొమ్మ'


నియామక పత్రం అందిస్తున్న ఎంపీ కలిశెట్టి

జి.సిగడాం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈస్ట్ కోస్ట్ రైల్వే జోనల్ వినియోగదారుల సలహా సంఘం సభ్యుడిగా సంతవురిటికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బాలబొమ్మ వేంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు శుక్రవారం అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, ప్రధాన కార్యదర్శి కుదిరెళ్ల బుజ్జి, పీఏసీఎస్ చైర్మన్ నక్క మురళి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సంక్షేమానికి విశిష్ట సేవలు

ఆమదాలవలస, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయుల సంక్షేమానికి విశ్వేశ్వరరావు చేసిన సేవలు చిరస్మరణీయమని వక్తలు అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం పూర్వ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ విశ్వేశ్వరరావు మృతికి శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంతాపం తెలిపారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జీటీఏ జిల్లా అధ్యక్షుడు పైడి రామస్వామి నాయుడు, యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ పాల్గొన్నారు.

## ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి


వినతిపత్రం ఇస్తున్న దాసరి రాజు

సోంపేట/రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఆసుపత్రుల్లో మౌలిక వసతులు కల్పించాలని ఇచ్ఛాపురం జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు కోరారు. ఈ మేరకు శుక్రవారం మెడికల్ సర్వీసెస్ అం డ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాస్‌ను అమరావతిలో కలిసి వినతిపత్రం అందించారు. డయాలసిస్ కేంద్రాల్లో వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. బారువ ఆసుపత్రి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గండుపల్లి రాజారావు, డొక్కరి ఈశ్వరరావు, పెద్దింటి చందు, పాపారావు పాల్గొన్నారు.

# జీఎస్టీపై అవగాహన కార్యక్రమాలు

జీఎస్టీ 2.0పై అవగాహన కార్యక్రమాలు శుక్రవారం జిల్లాలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్లను ఎమ్మెల్యేలు ప్రారంభించారు.

### జీఎస్టీ 2.0తో సామాన్యులకు మేలు: శంకర్

అరసవల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ 2.0తో ఎలక్ట్రానిక్స్, ఇతర వస్తువుల ధరలు తగ్గి సామాన్యులకు ఎంతో మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శుక్రవారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఎలక్ట్రానిక్స్ వస్తువుల ఎగ్జిబిషన్ కమ్ సేల్స్‌ను జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ స్వప్నదేవితో కలిసి ప్రారంభించారు. ఈనెల 13వ తేదీ నుంచి 19 వరకు నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ పాఠశాల మైదా నంలో నిర్వహించనున్న సిక్కోలు ఉత్సవ్ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ఏడీ రఘునాథ్, జిల్లా జీఎస్టీ అధికారి చంద్రకళ, చౌదరి పురుషోత్తమ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### జీఎస్టీ తగ్గింపుతో ఊరట: బగ్గు

నరసన్నపేట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో సామాన్యులకు ఊరట కలిగిందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక జట్టు కళాసీ యూనియన్ భవనం వద్ద సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ వస్తువుల గ్రాండ్ ఎగ్జిబిషన్ కమ్ సేల్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నేతలు బగ్గు అర్జున, దామోదరం నర్సింహం, శిమ్మ చంద్రశేఖర్, గొద్దు చిట్టిబాబు, జీఎస్టీ అధికారులు పాల్గొన్నారు.


అరసవల్లి: సిక్కోలు ఉత్సవ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

### విస్తృత ప్రచారం చేయాలి: ఎంజీఆర్

పాతపట్నం అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జీఎస్‌టీ 2.0 అమలుపై విస్తృతస్థాయి ప్రచారం చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌లో భాగంగా స్థానిక కేఎస్ఎం ప్లాజాలో ఎలక్ట్రానిక్స్ హోం అప్లియెన్సెస్ ప్రదర్శనను శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో జీఎస్టీవో శ్రీనివాసరావు, ఎంపీడీవో హెచ్.వెంకటరమణమూర్తి, టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు పైల బాబ్జీ సైలాడ సతీష్, మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.


పాతపట్నం: అవగాహన కలిగిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


నరసన్నపేట: ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

● ఎచ్చెర్ల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ చెల్లింపులో పారదర్శకత పాటించి దేశాభివృద్ధికి సహకరించాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఇంటెలిజెన్స్ విభాగం (విశాఖపట్నం) డాక్టర్ కేవీ మోహనరావు అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం సూపర్ జీఎస్టీ సెలబ్రేషన్స్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్‌కు రూరల్ ఎస్ఐ

ఇచ్ఛాపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావుకు వీఆర్‌కు పంపించారు. ఈ మేరకు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కేసులు నమోదులో తాత్సారం, అవినీతికి పాల్పడి వారిని కేసులు నుంచి తప్పిం చడం తదితర ఆధారంగా విధుల నుంచి తప్పించారు.

## ఘనంగా సామూహిక పూజలు


కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

ఇచ్ఛాపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రత్తకన్న గ్రామం నాయుడు వీధిలో గజలక్ష్మి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. గ్రామ పురో హితులు శివరాం పండా, సత్యనారాయణ పంతులు ఆధ్వర్యంలో 140 మంది మహిళలు ఈ పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

రణస్థలం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి పోటీలకు కొచ్చెర్ల జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం కె.తిరుపతిరావు తెలిపారు. ఇటీవల జిల్లా కేంద్రంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో అండర్- 14, 17, 19 ఖోఖో విభాగంలో జె.భవాని, కె.భూలక్ష్మి, డి.రాజు, కె.విమల ప్రతిభ కనబరిచారన్నారు. త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

## ఐవీఆర్ సర్వేపై అవగాహన

గార, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖాపరంగా ప్రజలకు అందిస్తున్న సేవలపై ప్రభుత్వ చేపట్టిన ఐవీఆర్ సర్వేపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఆర్డీవో సాయి ప్రత్యూష అన్నారు. శుక్రవారం సాలిహుండం గ్రామ సచివాలయం వద్ద రైతులతో మాట్లాడారు. రైతులతో స్వయంగా మాట్లాడి వారి అనుభవాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.చక్రవర్తి, వీఆర్వో సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలి

● ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందాలని, ఈ దిశలో అందరూ పనిచేయాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తమ్మినేని శారద అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు సమస్యలను ప్రస్తావించారు. ఈక్రాప్ నమోదు సక్రమంగా చేయకుంటే ధాన్యం కొనుగోలులో రైతులు ఇబ్బందులు పడతారని, అందువల్ల త్వరితగతిన ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఏవో మెట్ట మోహన్‌రావును ఆదేశించారు. ఎన్ని ఇళ్ల నిర్మాణం జరిగాయో తెలియ జేయాలని ఎమ్మెల్యే కోరగా హౌసింగ్ అధికారి సన్యాసిరావు వద్ద వివరాలు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రోణంకి వెంకటరావు, జడ్పీటీసీ బెండి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

# రిటైరైన వారికి సాయం మంచి సంప్రదాయం: ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖలో సుదీర్ఘకాలం విధులు నిర్వహించి రిటైర్ అయిన ఉద్యోగులకు సహచరులు ఆర్థిక సాయం చేయడం మంచి సంప్రదాయమని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. హోంగార్డు ఎల్‌వీఆర్ మూర్తి పదవీ విరమణ చేయగా సహచర ఉద్యోగులు స్వచ్ఛందంగా సుమారు రూ.4.08 లక్షలను సమకూర్చారు. ఈ చెక్కును ఎస్పీ శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటువంటివి పోలీస్ సిబ్బందిలో ఐక్యతను, మానవతా విలువ లను ప్రతిబింబిస్తాయన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యంపై దృష్టి పెట్టి కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోలీస్ కార్యాలయం ఏవో గోపీనాథ్, ఆర్ఎస్ఐ వెంకటరమణ పాల్గొన్నారు.


రిటైర్డ్ హోంగార్డు మూర్తికి చెక్కును అందిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

## మృతుడి కుటుంబానికి పరామర్శ

గార రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మం పంచాయతీ పరపతివానిపేటకు చెందిన టీడీపీ కార్యకర్త పరపతి అసిరినాయుడు తండ్రి చిన్నయ్య (65) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గొండు శంకర్ వారి కు టుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతోపాటు ఎంపీటీసీ సభ్యుడు కైబాడి రాజు, నేతలు వీఎస్ గిరి, కోరాడ వెంకటరావు, మైగాపు ప్రభాకరరావు ఉన్నారు.

## సత్యసాయి మార్గంలో పయనించాలి

ఇచ్ఛాపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయిబాబా సూచించిన మార్గంలో అందరూ పయనించాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నవ్యశ్రీ అన్నారు. సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కళాశాలలో 'రేపటి భవిష్యత్ మన చేతుల్లోనే' అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సత్య సాయిసేవా సమితి కన్వీనర్ ఆర్.గోపాలరావు, అధ్యాపకులు పి.సుధాకర్, జనార్దనరావు, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## యాప్‌ల భారం తగ్గించాలి

ఇచ్ఛాపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బోధనేతర కార్యక్రమాల వల్ల బోధనా సమయం హరించుకుపోతోందని, అందువల్ల యాప్‌ల భారం తగ్గించాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్య క్షుడు ఆర్వీ అనంతాచార్యులు డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్ర వారం ఏపీటీఎఫ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శంకర్, జి.ఉమాశంకర్, ఏపీటీఎఫ్ నాయకులు కె.సత్యమయ్య, పి.కామరాజు, సీహెచ్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

● కంచిలి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బోధనేతర పనులను బహిష్కరిస్తున్నామని ఫ్యాప్టో ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు ఎమ్మార్సీలో శుక్రవారం ఎంఈవోలను కలిసి వినతిపత్రం అందించారు. బోధనేతర పనుల వల్ల బోధనపై దృష్టిసారించలేకపోతున్నామని, ప్రభుత్వం ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి తప్పించాలని కోరారు.

## మధ్యాహ్న భోజనం పరిశీలన


మధ్యాహ్న భోజనాలను పరిశీలిస్తున్న అధికారులు

కంచిలి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఎంఎస్ పల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపీడీవో వి. తిరు మలరావు, ఎంఈవో లు శివరాంప్రసాద్, చిట్టిబాబు పరిశీలించారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఈ అన్నం తినలేం' శీర్షికతో వచ్చిన కథనానికి వారు స్పందించారు. భోజన పదార్థాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

### త్వరలో కొత్తపేట రోడ్డు పనులు

ఎచ్చెర్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తోటపాలెం జంక్షన్ నుంచి కొత్తపేట మీదుగా అంబేడ్కర్ నగర్ వరకు ఉన్న రోడ్డు పనులు త్వరలో చేపట్టనున్నట్లు పంచాయతీరాజ్ డీఈఈ మాధ వీలత తెలిపారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'దారుణం' శీర్షికతో కథనం వచ్చిన సంగతి తెలిసిందే. రోడ్డు దుస్థితిని శుక్రవారం ఆమె ఏఈ పోలినాయుడుతో కలిసి పరిశీలించారు. ఇటీవల గ్రామస్థులు గ్రీవెన్స్‌లో కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకు వెళ్లారు. రోడ్డు పనులు పూర్తయితే ఆయా గ్రామాలకు రవాణా మెరుగుపడుతుంది.

## మానసిక ఆరోగ్యం ముఖ్యం

గుజరాతీపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యమని సమగ్రశిక్ష ఏసీసీ డాక్టర్ ఎస్.శశిభూషణ్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సమగ్రశిక్ష ఏఎస్‌వో గోవిందరావు, ఉమా, మానసిక వైద్య నిపుణుడు బెండి సాయిరాం, ఇన్‌చార్జి హెచ్ఎం ఆర్.సీతన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

● ఇచ్ఛాపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): శారీరక, మానసిక ఆరోగ్యంపై యువత ప్రత్యేక దృష్టి సారించాలని ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్‌నేషనల్ రీజియన్-4 అధ్యక్షుడు పల్లంటి చిరంజీవి అన్నారు. అంతర్జాతీయ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం పలు పాఠశాలల్లో విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కలిగించారు. భావోద్వేగాలను నియంత్రించుకోవడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

● ఆమదాలవలస, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎన్‌సీసీ ఆఫీసర్ పి. మోహన్‌రావు విద్యార్థులతో మానసిక ఆరోగ్య పరరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. గొంటి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

## రామనామ సంకీర్తన రేపు

లావేరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వెంకటాపురంలో రామనామ సంకీర్తన వార్షికోత్సవం ఆదివారం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామస్థులు చేపట్టిన సంకీర్తన 12వ తేదీ నాటికి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. స్వామి శ్రీనివాసానంద పాల్గొని ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తారన్నారు.

## న్యూస్ బాక్స్

### రేపు ఎర్రన్న విద్యాసంకల్పం మాక్ టెస్టు

అరసవల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఎర్రన్న విద్యా సంకల్పంలో భాగంగా ఆర్ఆర్‌బీ, గ్రూప్-డి అభ్యర్థులకు ఆదివారం మాక్ టెస్టు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నగరంలోని ఉమెన్స్ కళాశాల రోడ్డులోని కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేవామని, మాక్ టెస్టుకు రిజిస్టర్ చేసుకున్న అభ్యర్థులు ఆ రోజు ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు. జిల్లాలోని నిరుద్యోగులకు, పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యే వారికి ఈ మాక్ టెస్టులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

### వినతుల స్వీకరణ

ఆమదాలవలస, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను శుక్రవారం ప్రజాదర్బార్‌లో పార్టీ కార్యాలయ ప్రతినిధి పీవీకే రాజు స్వీకరించారు. పారిశుద్ధ్య నిర్వహణ, కాలువలు, సాగు, తాగునీటిపై వివిధ ప్రాంతాల నుంచి ఫిర్యాదులు అందినట్లు పేర్కొన్నారు. వీటిని ఎమ్మెల్యే రవికుమార్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా సాధికారిక కమిటీ సభ్యుడు నాగళ్ల మురళీధర్‌యాదవ్, బగాది భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

### రేపు జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ ఎంపికలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీలకు గాను ఎంపికలను స్థానిక కోడిరామ్మూర్తి స్టేడియంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కూన రవికుమార్, కార్యదర్శి సూర శ్రీనివాసరావు తదితరులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు నవంబరు 8వ తేదీ నుంచి గుంటూరు జిల్లా పిడుగురాళ్లలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొం టారని, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపికల స్థలానికి వచ్చి ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎంవీ రమణను రిపోర్టు చేయాలని వారు ఆ ప్రకటనలో కోరారు.

## పెళ్లి చేసుకుంటానని మోసం

- యువకుడిపై కేసు నమోదు

కోటబొమ్మాళి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ బాలికను మోసం చేసిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ వి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ వద్ద ఆమె కొడుకు, కోడలు చిన్నప్పుడే వారి కుమార్తెను వదిలేసి వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఆ బాలికను ఆ మహిళ తన భర్తతో కలిసి పెంచుకుంటున్నారు. ఆ బాలిక పదో తరగతి చదువుతున్న సమయంలో రోజూ ఇంటి నుంచి పాఠశాలకు వెళ్లి వచ్చేది. ఈ క్రమంలో ఇదే మండలం నీలంపేట గ్రామానికి చెందిన తుల శివాజీ ఆ బాలికను పరిచయం చేసుకుని, ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ప్రస్తుతం ఆ బాలిక ఇంటర్ చదువుతోంది. గత నెల 27న శివాజీ మద్యం తాగి ఆ మహిళ ఇంటికి వెళ్లి.. మీ మనుమరాలిని పెళ్లి చేసుకుంటానని, తనతో పంపించేయాలని గొడవ చేశాడు. దీన్ని అడ్డుకున్న ఆ భార్యాభర్తలను పక్కకు నెట్టి ఆ బాలికను వాళ్ల ఇంటికి తీసుకుని వెళ్లిపోయాడు. ఆ బాలికది తక్కువ కులమంటూ శివాజీ తల్లిదండ్రులు వీరి పెళ్లికి నిరాకరించారు. దీంతో శివాజీ ఆ బాలికను తిరిగి తీసుకొచ్చి ఆమె ఇంటి వద్ద విడిచిపెట్టేశాడు. ఈ విషయాన్ని ఆ గ్రామపెద్దలకు ఆ భార్యాభర్తలు చెప్పారు. దీంతో వారు శివాజీ, వారి తల్లిదండ్రులకు కబురు పెట్టారు. అయినా వారు రాకపోగా... మీ దిక్కున్నచోట చెప్పుకోండని బెదిరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

## భార్య ఫిర్యాదు చేసిందని వ్యక్తి ఆత్మహత్య


నాగరాజు (ఫైల్)

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): భార్య తనపై పోలీసులకు ఫిర్యాదు చేసిందని మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం నగరంలో చోటుచేసు కుంది. శ్రీకాకుళం రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సీమన్ ఉద్యోగం చేస్తున్న బర్రి నాగరాజు భార్య, ఇద్దరు పిల్లలతో గుజ రాతీపేట చెరువు గట్టు వీధిలో కొన్నేళ్లుగా నివసిస్తున్నాడు. అయితే నాగరాజు విధులు నిమిత్తం ఏడాదిలో తొమ్మిది నెలలు బయట ప్రాంతంలో ఉంటున్నాడు. ఇటీవల ఇంటికి వచ్చిన నాగరాజు భార్యతో నిత్యమూ గొడవలు పడడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో మనస్తాపానికి గురైన ఆయన శుక్రవారం మధ్యాహ్నం తన ఇంటి గదిలో ఫ్యాన్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నాగరాజు తల్లి ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## టీడీపీ నేత సత్యప్రసాద్ మృతి


సత్య ప్రసాద్ (ఫైల్)

ఆమదాలవలస, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు పైడి సత్యప్రసాద్(62) శుక్రవారం అనారోగ్యంతో ఢిల్లీలో మృతి చెందారు. ఈ మేరకు అక్కడి నుంచి కుటుంబ సభ్యులకు సమాచారం రావడంతో బూర్జ మండలంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆమదాలవలస మాజీ ఎమ్మెల్యే పైడి శ్రీరామ్మూర్తి తనయుడు సత్యప్రసాద్. ఈయన తాత నరసింహ అప్పారావు టీటీడీ ఛైర్మన్‌గా వ్యవహరించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీలో చేరిన సత్య ప్రసాద్ ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు ముఖ్య అనుచరుడిగా వ్యవహరించారు. ఈయనకు భార్య అమ్మాజమ్మతో పాటు ఇద్దరు కుమారులున్నారు. సత్యప్రసాద్ అకాల మరణంపై పలువురు కూటమి నేతలు సంతాపం తెలిపారు.

## కారుకు నిప్పంటించిన దుండగులు


పూర్తిగా కాలిపోయిన కారు

జలుమూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అంధవరం పంచాయతీ రామకృష్ణాపురంలో షెడ్‌లో ఉన్న కారుకు గుర్తు తెలియని దుండగులు గురువారం అర్ధరాత్రి నిప్పంటించారు. కారు యజమాని మర్ల ప్రశాంత బాబు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కారు పూర్తిగా ఇంజన్‌తో సహా కాలిపోయిందని ప్రశాంతబాబు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ కె.రాజశేఖర్ తెలిపారు.

## రేషన్ కార్డు మంజూరుకు చర్యలు


వివరాలు సేకరిస్తున్న అధికారులు

హిరమండలం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): లోకొండ గ్రామనికి చెందిన గిరిజన దివ్యాంగ మహిళ గౌరమ్మకు రేషన్ కార్డు అందించేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'పదేళ్లుగా రేషన్‌కు దూరం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సీఎస్‌డీటీ భీమారావు, వీఆర్వో నారాయణ గ్రామానికి వెళ్లి గౌరమ్మ వివారులు సేకరించారు. ఒంటరిగా జీవిస్తుండడంతో ఒంటరి మహిళ కింద రేషన్ కార్డుకు సచివాలయంలో దగ్గరుండి దరఖాస్తు చేయించారు. త్వరలోనే రేషన్ కార్డు మంజూరు అవుతుందని సీఎస్‌డీటీ తెలిపారు. దీంతో గౌరమ్మ సంతోషం వ్యక్తం చేసింది.

## సెంచూరియన్ వర్సిటీకి గుర్తింపు



పర్లాకిమిడి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ విశ్వవిద్యాలయం ప్రచురించిన ప్రతిష్టాత్మక ప్రపంచ విశ్వవిద్యాలయాల్లో స్థానిక సెంచూరియన్ వర్సిటికి గ్లోబల్ స్థాయిలో 1501వ ర్యాంకు, జాతీయ స్థాయిలో 98వ ర్యాంకు వచ్చిందని వర్సిటీ ఉపకులపతి సుప్రియ పట్నాయిక్ తెలిపారు. శుక్రవారం ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. పర్లాకిమిడిలో గల ఈ విశ్వవిద్యాలయం ప్రపంచ గుర్తింపులో ప్రత్యేకత సాధించిందని, బోధన, ఆవిష్కరణలు, పరిశోధనలో పెరుగుతున్న శ్రేష్టతను ప్రతిబింబిస్తుందన్నారు. నైపుణ్య, సమగ్ర సమ్మిళిత విద్యపై భారతదేశంలోని అత్యంత ప్రగతిశీల విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా పేరొందడం గొప్ప విషయమన్నారు. దేశంలోని టాప్ 100 వర్సిటీల్లో ఒకటిగా నిలవడం ఆనందంగా ఉందన్నారు.

## పదో తరగతి టాపర్లకు పురస్కారాలు

ఒడిశా

పర్లాకిమిడి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): గజపతి జిల్లా గుసాని సమితి కొరసొండ గ్రామంలో రాజీవ్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రామరాజు చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు రామరాజు ఆధ్వర్యంలో ఈ ఏడాది 10వ తరగతి టాపర్లకు అభినందన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. 2024-25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో రాజీవ్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన గుంపు రేణుశ్రీ, కలగ ప్రసన్న రామరాజు పురస్కారంతో పాటు నగదు అందించారు. పాఠశాల హెచ్‌ఎం, విద్యార్థుల తల్లిదండ్రులకు అభినంధనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కామేశ్వర్, హెచ్‌ఎం రాజశేఖరం పాల్గొన్నారు.

# దారికాచి దోపిడీ

- ఐదుగురు హిజ్రాలు, డ్రైవరు అరెస్టు
- బంగారం ఆభరణాలు, కారు స్వాధీనం
- పలు జిల్లాల్లో చోరీలు
- నిందితులది తూర్పుగోదావరి జిల్లా

నరసన్నపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వారంతా హిజ్రాలు.. నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతాల్లో రోడ్డుపైకి నలుగురైదుగురు మూకమ్మడిగా వస్తారు. ద్విచక్ర వాహనాలపై, కారులపై వచ్చేవారిని ఆపి యాచకం చేస్తారు. ఈ క్రమంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోతే వారిపై దాడి చేసి దోచుకుంటారు. ఇలా పలు ప్రాంతాల్లో ఐదుగురు హిజ్రాలు.. వారి కారు డ్రైవరు దోపిడీలకు పాల్పడుతుంటారు. వీరిని నరసన్నపేట పోలీసులు చాకచక్యంగా పట్టుకొని కటకటలాకు పంపించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శుక్రవారం రాత్రి టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ నెల 3న నరసన్నపేట మండలం నడగాం గ్రామానికి చెందిన జవాన్ దొంపాక అనంద రమణ ద్విచక్ర వాహనంపై నరసన్నపేట వెళ్తుండగా.. ఉర్లాం ఉన్నత పాఠశాల సమీపంలో ఐదుగురు హిజ్రాలు అతడిని అడ్డగించి డబ్బులు అడిగారు. డబ్బులు ఇచ్చేందుకు అతడు నిరాకరించడంతో అతడి మెడ లో ఉన్న బంగారం చైన్ బలవంతగా తీసుకున్నా రు. ఈ ఘటనపై ఆనంద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసుల ఆ దిశగా విచారణ చేపట్టారు. ఈ క్రమంలో ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తన సిబ్బందితో మడపాం టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఓ కారులో ఐదుగురు హిజ్రాలు రావడాన్ని గమనించారు. వారిని విచారిస్తుండగా పారిపోయేందుకు ప్రయత్నించారు. సిబ్బంది అప్రమత్తమై వారిని అదుపులోకి తీసుకుని విచారించగా బండారం బయటపడింది. ఈ వ్యవహారంలో నందిగాం నేహ, మండల శ్రావణి, అల్లుబిల్లి ప్రియ, బేదంపూడి సాయిపల్లివి, నాగిరెడ్డి సుష్మ, డ్రైవర్ సేలం రామప్రవీణ్ అరెస్టు చేశారు. వారి నుంచి 32 గ్రాముల బంగారు ఆభరణాలు, హోండా సిటీకారు స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఈ ముఠా శ్రీకాకుళం, పార్వతీపురం జిల్లాలో పలు దోపిడీలకు పాల్పడినట్టు విచారణలో తేలిందన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐలు దుర్గాప్రసాద్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో చోరీ కలకలం

- 35 గ్రాములు బంగారం అపహరణ
- ఆలస్యంగా వెలుగులోకి..
- పోలీసుల అదుపులో అనుమానితులు?

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): నగర పరిధి తిలక్‌నగర్‌లోని ఓ ఇంట్లో జరిగిన చోరీ కలకలం రేపింది. ఆలస్యంగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. సుమారు 35 గ్రాముల బంగారం ఆభరణాలు అపహరణకు గురైనట్టు పోలీసులు గుర్తించారు. శ్రీకాకుళం రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యాంకర్‌గా పనిచేస్తున్న కారగ్గి మీన తన తల్లి పార్వతమ్మతో కలిసి తిలక్‌నగర్‌లో నివాసం ఉంటోంది. దేవీ నవరాత్రులు సందర్భంగా భవానీమాల వేసుకునేందుకు మీనా తన ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను గతనెల 21వ తేదీన బీరువాలో పెట్టింది. దీక్ష ముగించుకొని ఈనెల 5న తిరిగి ఇంటికి వచ్చినా బీరువాలో ఉన్న ఆభరణాలను చూసుకోలేదు. 7వ తేదీన విజయనగరంలో జరిగిన పైడితల్లి అమ్మవారి జాతరకు వెళ్లేందుకు ప్రయాణమవుతున్న సందర్భంలో బీరువాలో ఉన్న ఆభరణాలను వేసుకుందామని చూసేసరికి అవి కనిపించకుండా పోయాయి. దీంతో మీనా టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో టూటౌన్ సీఐ ఈశ్వరరావు శుక్రవారం ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అయితే పోలీసుల అదుపులో ఇద్దరు అనుమానితులు ఉన్నట్టు సమాచారం.

## భార్యను కడతేర్చి.. అగ్నిప్రమాదంగా చిత్రీకరించి

- మృతురాలిది టెక్కలి
- పోలీసుల అదుపులో భర్త
- ఒడిశా రాష్ట్రంలో ఘటన


ప్రియాంక (ఫైల్)

సాలూరు రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం కోరాపుట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా టెక్కలికి చెందిన మహిళను.. ఆమె భర్త అయిన కానిస్టేబుల్ హతమార్చి అగ్నిప్రమాదంగా చిత్రీకరించినట ఘటన చోటుచేసుకుంది. శుక్రవారం తమదైన శైలిలో పోలీసులు విచారించడంతో హత్యగా తేలింది. స్థానికులు, హతురాలి తండ్రి తరణి పండా తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం జిల్లా టెక్కలికి చెందిన ప్రియాంక పండాను ఒడిశా రాష్ట్రం నవరంగపూర్ జిల్లా డాబుగాం ప్రాంతానికి చెందిన శివశంకర్ పాత్రో గతేడాది జూలై 11న పెళ్లి చేసుకున్నాడు. వివాహ సమయంలో వధువు తండ్రి తరణి పండా అల్లుడికి రూ.2 లక్షలు, 12 తులాల బంగారం కానుకలుగా ఇచ్చారు. శివశంకర్ పాత్రో ఐఆర్‌బీలో కానిస్టేబుల్‌గా కోరాపుట్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఆయన బుధవారం రాత్రి అత్తమామలకు ఫోన్‌చేసి ఇంట్లో షార్ట్‌సర్క్యూట్ వల్ల జరిగిన అగ్నిప్రమాదంలో ప్రియాంక చనిపోయిన సమాచారం ఇచ్చాడు. అప్పటికి కొద్దిసేపటి క్రితమే కూతురుతో తండ్రి తరణి పండా ఫోన్‌లో మాట్లాడారు. వారు కోరాపుట్ వచ్చి కూతురు మరణంపై అనుమానం వ్యక్తం చేస్తూ.. కోరాపుట్ పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. అగ్నిమాపద దళం వారు సైతం ప్రమాదం జరిగిన తీరుపై అనుమానాలు వ్యక్తం చేశారు. దీంతో పోలీసుల శివశంకర్ పాత్రోను అదుపులోని తీసుకొని ప్రశ్నించడంతో రాడ్‌తో కొట్టడంతో ఆమె చనిపోయిందని తేల్చారు. ఈ ఘటనపై కోరాపుట్ సీఐ సత్యానంద్ పాత్రో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## హేమబాబు చౌదరిని పరామర్శించిన మాజీ మంత్రి శివాజీ


నివాలర్పిస్తున్న మాజీ మంత్రి గౌతుశివాజీ తదితరులు

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ దువ్వాడ హేమబాబు చౌదరిని మాజీ మంత్రి గౌతు శివాజీ పరామర్శించారు. హేమబాబు చౌదరి తండ్రి జగ్గు చౌదరి ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న శివాజీ శుక్రవారం గుల్లలపాడు వెళ్లి.. ఆయన చిత్రపటం వద్ద నివాళ్పించి సంతాపం తెలిపారు. హేమబాబు చౌదరితో మాట్లాడి ఆ కుటుంబాన్ని ఓదార్చారు. అలాగే పూడిజగన్నాథపురంలో గల టీడీపీ కార్యకర్త తిమ్మల యర్రయ్య మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట మండల టీడీపీ అధ్యక్షుడు సూరాడ మోహనరావు, మాజీ ఎంపీపీ గొరకల వసంతరావు, అరసవల్లి ఉమామహేశ్వరరావు, నెయ్యిల సూర్యనారాయణ, పోతనపల్లి సాంబమూర్తి ఉన్నారు.

## ఆసక్తితో వ్యాపారాలు చేసుకోవాలి


మహిళలతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో జగన్నాథ్

మెళియాపుట్టి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆసక్తితో వ్యాపారం చేసుకుంటే మంచి లాభలు వస్తాయని సీతంపేట ఐటీడీఏ పివో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వీడీవీకేలు ద్వారా జీడిపప్పు ఉత్పత్తుల పరికరాలు పరిశీలించారు. గత మూడు నెలలు నుంచి మిషన్లు పనిచేకపోవడంతో ఉత్పత్తులు ఆగిపోవడంపై మహిళలను అడిగి తెలుసుకున్నారు. మహిళలు సొంత పరిశ్రమగా భావించి పనులు చేసుకోవాలన్నారు. బాధ్యత గలవారిని ఎంపిక చేసి పనులు చేయించాలన్నారు. దీన్నితో పాటు అధికంగా రేషన్ సరుకుల కోసం గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని తెలిపగా.. ప్రత్యేక ఏర్పాటు చేస్తామన్నారు. ఎంపీడీవో ప్రసాద్ పండా, ఏపీవో రవి, ఏపీఎం త్రినాథమ్మ తదితరులు ఉన్నారు.

## ముంపు సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా


మాకవరంలో ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కలమట

కొత్తూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి) ఇటీవల సంబవించిన వరదలకు తీవ్రంగా పంటలు ముంపుకు గురై నష్టపోయిన రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రైతుల సమస్య వివరిస్తానని జిల్లా తెలగుదేశం పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి రైతులకు హామీ ఇచ్చారు. శుక్రవారం కొత్తూరు మండలం కుద్దిగాం, మాకవరం పంచాయితీల్లో వరదనీటికి ముంపుయిన పంటపొలాలను పరిశీలించి రైతులను ఓదార్చారు. రైతులు చేతికి మరి కొద్ది రోజుల్లో పంట చేతికి వస్తుందన్న తరణంలో అకాల వరదలకు పంటలు తీవ్రంగా నష్టపోయాయని అన్నారు. నీటి మునిగిన పంటలకు స్థానిక అధికారులతో సర్వే చేయించి జాబితాలు తయారు చేయించేలా అధికారులకు సహకరించాలని రైతులకు సూచించారు. తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పాత్రకొండ మోహనరావు, కుద్దిగాం సర్పంచ్ నెల్లి అచ్చుతరావు, మాజీ ఎంపీటీసీ నారాయణరావు, భీమరాజు, కాంతారావు, జగదీష్, వెంకటరమణ, సర్పంచ్ ప్రతినిధి నారాయణరావు, ఆనందరావుతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## జీఎస్‌టీ తగ్గింపుపై వస్తు ప్రదర్శన

పోలాకి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పోలాకి కేంద్రంలో శుక్రవారం జీఎస్‌టీ తగ్గింపు కారణంగా ఎలక్ట్రానిక్ అండ్ హోమ్ అప్లయిన్, వస్తువులపై తగ్గింపు ధరల వివరాల తెలుపుతూ వ్యాపారులు వస్తుప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనకు ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి హాజరయ్యారు. వ్యాపారులు వినియోగదారుల వస్తువులపై వస్తువు ప్రకారం తగ్గిన ధరలను ఎమ్మెల్యేకు వివరించారు సావధానంగా విన్న ఎమ్మెల్యే ప్రజలకు మేలుజరిగిందన్నారు.

## మేం ఇక్కడ వైద్యం చేయం

- గర్భిణిని తనిఖీ చేయని వైద్య సిబ్బంది
- వైద్యులను నిలదీసిన టీడీపీ నాయకులు
- ఎట్టకేలకు చికిత్స అందించిన వైనం


గర్భిణి బంధువులను వారిస్తున్న పోలీసు

నరసన్నపేట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులకు, గర్భిణులకు వైద్యసేవలు అందించకుండా కుంటి సాకులు చెప్పి వెనుకకు పంపించేస్తుండడం ఇక్కడ ఆనవాయితీగా మారింది. దీంతో చికిత్స కోసం వచ్చేవారంతా ఇబ్బందిపడుతున్నారు. ఇలాంటి సంఘటనే శుక్రవారం కూడా చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లే.. నరసన్నపేట పట్టణం తమ్మయ్యపేటకు చెందిన గర్భిణి దేవాది ప్రియాంక ఉమ్మనీరు పోతుందని శుక్రవారం మధ్యాహ్నం 12గంటల సమయంలో ఏరియా ఆసుపత్రికి వచ్చింది. అయితే సంబంధిత డాక్టర్ ఆమెను తనిఖీ చేసేందుకు నిరాకరించారు. ఇంతవరకు ఏ డాక్టర్‌కి చూపించారో.. ఇప్పుడు అక్కడికే వెళ్లాలంటూ సలహా ఇచ్చారు. దీంతో ఆ గర్భిణి తిరుగుముఖం పట్టి.. ఆసుపత్రిలో వైద్యులు తీరును బంధువులకు చెప్పింది. ఈ విషయం స్థానిక టీడీపీ నాయకులకు ఆమె బంధువులు చెప్పడంతో, వారంతా ఆసుపత్రికి చేరుకొని గర్భిణికి వైద్యం అందించకపోవడంపై సంబంధిత డాక్టర్‌ను నిలదీశారు. మీరు ఎవరికి చెప్పుకున్నా భయం లేదని, నేను వైద్యం చేసే ప్రసక్తే లేదని ఆ డాక్టర్ మొండి పట్టు పట్టి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసబాబు దృష్టికి చేరడంతో ఆయన స్పందించి.. ఆ గర్భిణికు వైద్యపరీక్షలు నిర్వహించారు. కగా డాక్టర్ తీరుపై మండిపడుతూ వారంతా అక్కడి నుంచి వెళ్లిపోయారు. నరసన్నపేట ఏరియా ఆసుపత్రిలో కొందరు వైద్యులు, సిబ్బంది తీరుతో రోగులకు సేవలు అందకపోవడంతో పాటు ప్రైవేట్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా స్త్రీవైద్య నిపుణులు కొందరు తమ ఆసుపత్రిల్లో కాన్పులు చేయించుకునేందుకు ఇలా ఏరియా ఆసుపత్రుల్లో వ్యవహరిస్తున్నట్టు ప్రచారం జరుగుతుంది. గతంలో మాదిరిగానే ఏరియా ఆసుపత్రిలో వైద్యసేవలపై సర్వత్రా విమర్శలు వినిపిస్తుండడం విశేషం.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

పాతపట్నం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైనవారందరికీ చేరేలా చూడాలని బ్రెడ్స్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జేవీ రమణ తెలిపారు. స్థానిక బ్రెడ్స్ కార్యాలయంలో ఆదివాసీ యువతకు ప్రభుత్వ పథకాల అమలుపై శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. తల్లికివందనం అన్నదాత సుఖీభవ ఉపాధిహామీ, పీఎం కిసాన్, మాసమే మైక్రోస్మాల్, మార్జినల్ ఎంటర్ప్రైనర్షిప్ స్కీం సంబంధించిన ఫోర్‌వీలర్‌పై 40శాతం రాయితీ, కార్ సర్వీసెస్ సెంటర్‌కు 30శాతం రాయితీ వంటివి కేవలం గిరిజనులకు మాత్రమేవర్తించే పథకాలను వారికందే ప్రత్యేకప్రోత్సాహకాలను వివనిం,ఆనేజ వీటికి సంబంధించిన డాక్యుమెంటేషన్‌కావాల్సి సంబంధిత ధ్రువపత్రాలు మొబైల్ వినియోగ ఉపయోగాలు ఉపాధిహామీపనులు వివరాలు ఆధార్ అప్‌డేట్, ఆధార్‌లింక్ పథకాల స్టేటస్ తదితరఅంశాలను గ్రామస్థాయిలో ఎలా చూసుకోవాలో గ్రామసభల ప్రాధాన్య త నిర్వాహణావైనాలు తదితరఅంశాలపై శిక్షణనిచ్చారు. రిసోర్స్ పర్సన్స్‌గా ధర్మారావు, కృష్ణలు వ్యవహరించారు.

## రీ సర్వేకి ప్రజలు సహకరించాలి

కొత్తూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి) భూముల రీ సర్వేకు ప్రజలు అధికారులకు సహకరించాలని టెక్కలి ఆర్డీవో సుదర్శనరావు రైతులను కోరారు. శుక్రవారం కొత్తూరు మండలం పారాపురం గ్రామంలో భూ రీసర్వేను ప్రారంభించి మాట్లాడారు. రైతులు తమ భూములను సక్రమంగా సర్వే చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ భూముల్లో సాగు ఉన్న అటువంటి వారికి ఎటువంటి హక్కు ఉండదని, సోంత జిరాయితీ భూములు తమ స్వాధీనం, సాగులో ఉన్న సర్వే నెంబరు రైతులు పేర పొందేలా సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. పారాపురం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు భూములు ఇవ్వగా మిగిలి ఉన్న భూములు రైతులు పేరుతో పాట్టాలు రావటం లేదని దీనితో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.బాలకృష్ణ, సర్పంచ్ కుంచాల రత్నాలు, ఎంపీపీ సవర సావిత్రి పారాపురం ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, గ్రామ పెద్దలు తోట నందకుమార్, కుంచాల నూకరాజు గూనబద్ర ఆర్‌ఆర్, సర్పంచ్ పెద్దకోట సాదుబాబు, వైకుంఠరావులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కంటి పరీక్షలు

కోటబొమ్మాళి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జాతీయ అంధత్వ, దృష్టిలోపం నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 185 మంది విద్యార్థులకు శుక్రవారం దండుగోపాలపురం పీహెచ్‌సీ ఆప్తాల్మిక్ అధికారి ఎంఆర్‌కే దాస్ కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 21మంది విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్టు గుర్తించి ఉచిత కళ్లద్దాలకు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి కిషోర్, హెచ్‌ఎం కె.శాంత కుమారి, హెల్త్ ఎడ్యుకేటర్ జి.చిన్నతల్లి, ఆరోగ్య పర్యవేక్షకులు డి.భీమారావు తదితరులు పాల్గొన్నారు.

## దూడల వ్యాన్ పట్టివేత

నరసన్నపేట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి మండలం నారాయణవలస సంత నుంచి విజయనగరం జిల్లా అలమండ సంతకు అక్రమంగా వ్యాన్‌లో తరలిస్తున్న 16 దూడలతో కూడిన వాహనాన్ని శుక్రవారం మడపాం టోల్‌ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా దూడలను తరలించడంతో వాహనాన్ని సీజ్‌చేసి దూడలను సంరక్షణ కేంద్రానికి తరలించినట్టు ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

## పోస్టర్ ఆవిష్కరణ

నరసన్నపేట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో 17 వైద్య కళాశాలను ప్రైవేటీకరణ కోసం పీపీపీ అనుసరించే విధానానికి వ్యతిరేకంగా వైసీపీ కోటిసంతకాలు సేకరణ పోస్టర్‌ను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ శుక్రవారం ఆవిష్కరించారు. వైద్య కళాశాలను ప్రైవేటీకరణ వ్యతిరేకించేందుకు కోటిసంతకాలు సేకరణ చేయడం జరుగుతుందని కృష్ణదాస్ అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దీపావళికి స్థలాలు పంపిణీ

కాశీబుగ్గ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్వాసితులకు వస్తున్న దీపావళికి స్థలాలు పంపిణీ చేయనున్నట్లు 11వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి చంద్రశేఖర్‌త్యాడి అన్నారు. శుక్రవారం కాశీబుగ్గ సూదికొండ, లేబర్‌కాలనీకు మధ్యలో స్థలాలను చదును చేసి పరిశీలించారు.ఈ సందరకభంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్‌ఓబి 97 మంది నిర్వాసితులకు దీపావలి రోజున స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష చేతుల మీదుగా స్థలాలు పంపిణీ చేస్తారని తెలిపారు. ఒకవైపు శరవేగాంగా రైల్వే గేటు పనులు, మరో వైపు నిర్వాసితలకు నష్టపోకుండా ఇబ్బందులు కలగకుండా స్థలం ఇవ్వడానికి యుద్ద ప్రాతిపదికని చదును చేయడం జరుగుతుందని అన్నారు.

## పోరాటంతోనే కాలపరిమితి రద్దు

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): వీవోఏల మూడేళ్ల కాలపరిమితి రద్దు వెనుక సీఐటీయూ పోరాటం ఉందని ఆ యూనియన్ మండల అధ్యక్షుడు ఎన్.మోహనరావు అన్నారు. శుక్రవారం నగరంపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మూడేళ్ల కాలపరిమితి వల్ల వీవోఏలు ఉద్యోగభద్రత కోల్పోతారన్నారు. అందువలనే సీఐటీయూ వారికి అండగా ఉండి దశలవారీగా పోరాటం చేసిందన్నారు. ప్రభుత్వ పథకాలన్నీ ప్రజల్లోకి తీసుకెళ్తున్న వీవోలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలుగా గుర్తించి నెలకు రూ.26 వేలు వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా నాయకరాలు బి.సుగుణావతి, బి.లక్ష్మి, ఎన్.ధనలక్ష్మి, డి.శాంతి, ఎం.విజయ ఉన్నారు.

## పనుల్లో నాణ్యత ఉండాలి

కొత్తూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి) భవన నిర్మాణ పనుల్లో నాణ్యతను పాటించాలని సీతంపేట ఐటిడిఏ పివో స్వప్నిల్ జగన్నాథం ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. శుక్రవారం కొత్తూరు మండలం కొత్తగూడ గిరిజన గ్రామంలో నిర్మిస్తున్న మల్టీపరపస్ భవన నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేసారు.పీ వో తో పాటు ఐటిడిఏ ఈఈ రమాదేవి, డిఈ సిమ్మన్న, సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

## రీ సర్వే పై అవగాహన

నందిగాం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి) పాలవలస లో శుక్రవారం రీసర్వేపై అవగాహన కల్పించారు. నరేంద్రపురం సర్పంచ్ సన్యాసిరావు అధ్యక్షతన ఉప తహసీల్దార్ ఆర్.రామరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్వే సమయంలో రైతులు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్వేయర్ హనుమంతరావు, తదితరులు ఉన్నారు.

## బాలికలు ముందు ఉండాలి

టెక్కలి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో బాలికలు ముందు ఉండాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గోవిందమ్మ తెలిపారు. శుక్రవారం అంతర్జాతీయ బాలికలు దినోత్సవాన్ని నిర్వహించారు. బాలికలే రేపటి భారత తారకలని తెలిపారు. బాలికలు బాధ్యతలు నిర్వహించి హక్కులను పొందాలన్నారు. ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో చదువుకోలన్నారు. చదువుతో పాటు సామాజిక సేవ ఉండాలన్నారు. అటువంటి వారికి గుర్తింపు లభిస్తుందన్నారు.

## తహసీల్దార్ కార్యాలయంలో గలాట

కొత్తూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి) కొత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం మహిళా అర్జీదారు, సిబ్బంది మధ వాగ్వాదం జరగడంతో సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ సిహెచ్ ప్రసాద్, సిబ్బందితో అక్కడికి చేరుకుని తగాదా లేకుండా నివారించారు. అర్జీదారు, కార్యాలయ సిబ్బంది ఇరువురు ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. బలద గ్రామానికి చెందిన అరుబోలు కమల తన ఇంటి రిజస్ట్రేషన్ కోసం ఫీజుబులిటి సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకోగా, గత మూడు రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ క్రమంలో శుక్రవారం మరో సారి కార్యాలయం వచ్చి సర్టిఫికేట్ అడిగితే కార్యాలయ సిబ్బంది, అధికారులు దురుసుగా మాట్లాడి అవమానిం చారని ఆరోపించారు. కాగా కార్యాలయంలోకి ఆమె వచ్చి విధుల్లో ఉన్న సిబ్బందిపైనా తహసీల్దార్‌పైనా నానా దుర్భాషలాడి దౌర్జన్యం చేసినట్టు సిబ్బంది ఫిర్యాదు చేశారు. ఈ సమస్య పోలీసులు స్టేషన్ వరకు చేరింది.

## ప్రజారోగ్యమే సమాజానికి బలం

పాతపట్నం రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యమే సమాజానికి బలమని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు.తెలిపారు. శుక్రవారం తమర గ్రామంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఆరోగ్యనికి పెద్దపీట వేయటం జరుగుతుందన్నారు. ఎన్‌టీఆర్ ఆరోగ్యసేవలు పెంచటం జరిగిందన్నారు.